రైతన్నకు తెగుళ్ల గుబులు!

● ఆందోళన చెందుతున్న వరిరైతు



అంపురంలో తెగుళ్లు వ్యాపించిన వరిపైరును రైతులతో కలిసి పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కంచిలి: ఖరీఫ్ వరి పంటకు తెగుళ్ల తాకిడి ఎక్కువయ్యింది. వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది వరి పైరుకు వివిధ రకాల తెగుళ్లు సోకాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉష్ణోగ్రత 18 నుంచి 22 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 90 శాతం, మబ్బులతో కూడిన వర్షం వచ్చినప్పుడు, యూరియా ఎక్కువ మోతాదులో వాడినప్పుడు తెగుళ్ల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కంచిలి మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 9,934 ఎకరాలలో వరిని రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో సుమారు 8,654 ఎకరాలకు పైగా పాముపొడ తెగులు, సుడిదోమ ఆశించడంతో రైతుల్లో ఆందోళన ఎక్కువైంది.

పొడతెగులు.. లక్షణాలు

పొడతెగులు దుబ్బు చేసే దశ నుంచి పొట్ట దశ వరకు ఆశిస్తుంది. మట్ట ఆకుపై పాము పొడ మచ్చలు ఏర్పడి మొక్కలు ఎండిపోతాయి.

నివారణ ఇలా..

గట్లపై కలుపు లేకుండా చూడాలి. హెక్సాకొనజోల్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారి చేయాలి. అలాగే వాలిడా మైసిన్- 2 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

సుడిదోమ.. లక్షణాలు

గోధుమ వర్ణం లేదా తెల్లవీపు మచ్చ దోమలు దుబ్బ అడుగున నీటి మట్టంపై ఉండి దుబ్బుల నుంచి రసం పీల్చుతాయి. పైరు సుడులుగా ఎండిపోతుంది.

నివారణ ఇలా..

వరినాట్లు వేసేటప్పుడు ప్రతీ రెండు మీటర్లకి 20 సెంటీమీటర్లు కాలిబాటలు విడిచి పెడితే ఈ దోమ వ్యాపించదు. బూప్రోపెజిన్-1.6 మీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచీకారి చేయాలి. ఇమిడాక్లోప్రిడ్, ఎథిప్రోల్- 0.25 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచీకారి చేయాలి. పై మైట్రోజైన్- 0.6 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.



వరి పంటకు ఆశించిన పొడతెగులు



సుడిదోమ నష్టపర్చిన పైరును చూపిస్తున్న రైతు

రెండు ఎకరాల్లో పైరుకు తెగుళ్లు..



నాకు ఉన్న మూడు ఎకరాల పొలంలో ఈ ఏడాది వరి సాగు చేస్తున్నాను. ఇందులో ఇప్పుడు రెండు ఎకరాల పైరుకు తెగుళ్లు వ్యాపించాయి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పటికే యూరియా, పొటాష్ ఎరువులు వేశాను. పంట చేతికి వస్తుందో..లేదోనని దిగులుగా ఉంది.

– రాపాక రామయ్య, రైతు,
గొల్లకంచిలి, కంచిలి మండలం

నివారణ చర్యలు చేపడితే ఉపశమనం



వరి పైరుకు ఆశించిన పొడ తెగులు, సుడిదోమ నివారణ చర్యల్ని చేపడితేనే ఉపశమనం కలుగుతుంది. రైతులు ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా వ్యవసాయశాఖ సిబ్బంది సూచించిన విధంగా నివారణ మందులను తప్పనిసరిగా వాడాలి. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వరి పంటకు తెగుళ్లు ఆశించాయి.

-బి.ధనుంజయ,
మండల వ్యవసాయాధికారి, కంచిలి

క్లుప్తంగా

కుళాయి లీకులు అరికట్టండి



పైపుల లీకుతో వృథాగా పోతున్న నీరు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ నవీన్‌నగర్‌లో మంచినీటి కుళాయిలకు ఏర్పడిన లీకులను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. లీకుల వలన ఒక వైపు మంచినీరు వృథా కావడంతో పాటు దిగువ ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీరు సరఫరా జరగడం లేదని చెబుతున్నారు. పంచాయతీ యంత్రాంగం స్పందించి పైపుల లీకులను అరికట్టి సమస్యను పరిష్కరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తుఫాన్ భవనాలు పరిశీలన



మెట్టూరు తుఫాన్ భవనాన్ని పరిశీలిస్తున్న సీతారామయ్య

వజ్రపుకొత్తూరు రూరల్: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మెట్టూరు, గుణుపల్లి, చీపురుపల్లి, బాతుపురం, బైపల్లి గ్రామాల్లోని రక్షిత తుఫాన్ భవనాలను తహసీల్దార్ డి.వి.సీతారామయ్య శనివారం పరిశీలించారు. భవనాల్లోని సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్, తాగునీరు సౌకర్యం కచ్చితంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అనంతరం తుఫాన్‌పై మత్స్యకారులను అప్రమత్తం చేశారు. వీఆర్వోలు వెంకటరావు, ఇందిరాప్రియదర్శిని ఉన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ



గుర్తింపు కార్డులతో విద్యార్థులు

సోంపేట: కొర్లాం పంచాయతీ హుకుంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు శనివారం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షణ్ముఖరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, జాగృతి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

తీరప్రాంతంలో తహసీల్దార్ పర్యటన



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటరావు

ఇచ్ఛాపురం రూరల్: వాతావరణ శాఖ సూచనల మేరకు 24వ తేదీన వాయుగుండం ఉంటుందన్న సమాచారం మేరకు ముందస్తుగా గ్రామాల్లో చాటింపు వేయాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు సిబ్బందికి సూచించారు. డొంకూరు మత్స్యకార తీర ప్రాంతంలో శనివారం పర్యటించారు. అనంతరం తుఫాన్ రక్షిత భవనాన్ని పరిశీలించారు. వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా ముందస్తుగా దండోరా వేయాలని, రక్షిత భవనంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలకు సూచించారు.

సక్రమంగా స్వయంశక్తి సంఘాల నిర్వహణ



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

కంచిలి: స్వయంశక్తి సంఘాలను క్రమశిక్షణతో నిర్వహించాలని ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల సహాయకులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో జరుగుతున్న బేస్‌లైన్ సర్వే డేటాను వెంటనే పూర్తి చేయాలని, నిరక్షరాస్యులు, వలంటీర్ల వివరాలు సేకరించి నివేదించాలన్నారు. మండలంలోని 1619 సంఘాలకు 921 మాత్రమే ఏ-గ్రేడ్‌లో ఉన్నాయని అన్నారు. ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ మార్కెటింగ్ ద్వారా స్వయంశక్తి సంఘాల మహిళలు చేస్తున్న ఆదాయ కార్యక్రమాలు గుర్తించాలని సూచించారు. శ్రీనిధి జిల్లా మేనేజర్ కె.రాము, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలి



సోంపేట: రాజాంలోని కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి కిశోర్‌బాబు

టెక్కలి: వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి (ఎఫ్ఏసీ) జె.శ్రీనివాసరావు ఆదేశించారు. టెక్కలి, నందిగాం మండలాల్లోని పోలవరం, భీంపురం, జయపురం, సవర లింగుపురం గ్రామాల్లో వసతి గృహాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాల్లో వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. రోజూ మెనూ ప్రకారం భోజనాలు అందజేయాలని, వసతి గృహం పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత చర్యలు పాటించాలన్నారు. అనంతరం భోజనాలు పరిశీలించారు.

ఫొటో: 19టెక్కలి03: టెక్కలి: భోజనాలు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

సోంపేట: వసతి గృహాల్లోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి కె.కిశోర్‌బాబు సిబ్బందికి సూచించారు. రాజాంలోని కేజీబీవీ, మామిడిపల్లి, యర్రముక్కాం బాలుర వసతి గృహాలను శనివారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలని, వారికి ఇబ్బందులు కలగకుండా చూసుకోవలసిన బాధ్యత సిబ్బందికి ఉందన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి అండగా..



అవినాష్‌కు సాయాన్ని అందజేస్తున్న గ్రామపెద్దలు



బాలుడు మదన్‌కు సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కవిటి: కవిటికి చెందిన ఎస్.అవినాష్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఈయన విద్యకు ఇబ్బంది లేకుండా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న కవిటి ఉద్దానం ప్రాంతీయుల ఆరాధ్యదైవం చింతామణి అమ్మవారి ట్రస్టు అండగా నిలిచింది. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు ఇందిరాదేవి 50 వేల రూపాయలను సమకూర్చారు. ఈ మొత్తాన్ని విద్యార్థి అవినాష్‌కు స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు సమక్షంలో సోమవారం అందజేశారు. పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బాలుడి వైద్యం కోసం..

కవిటి మండలం బట్టివానిపాలెం గ్రామానికి చెందిన పేద మత్స్యకార బాలుడు చీకటి మదన్ రక్తహీనత సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న చిన్నకర్రివానిపాలెం గ్రామానికి చెందిన గంతి మోహన్ బాలుడి వైద్యం కోసం పది వేల రూపాయలను సమకూర్చారు. ఈ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు.

కోర్టు ఆవరణలో మొక్కలు నాటివేత



మొక్కలు నాటుతున్న జడ్జి ప్రసన్నలత

కోటబొమ్మాళి: పర్యావరణ సంరక్షణ కోసం మొక్కలు పెంపకాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని కోటబొమ్మాళి జూనియర్ సివిల్‌జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. కోర్టు ఆవరణలో ఆమె సిబ్బందితో కలిసి శనివారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసులు, ఏజీపీ ఎస్.తిరుపతి ఉన్నారు.

గజలక్ష్మీ అమ్మవారికి పూజలు



పూజలందుకున్న గజలక్ష్మీ అమ్మవారు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్న గ్రామంలో గజలక్ష్మీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దసరా అనంతరం వచ్చే పౌర్ణమి నుంచి గజలక్ష్మి నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి మొదలయ్యాయి. శనివారం రత్తకన్న నాయుడువీధిలో ఏర్పాటు చేసిన గజలక్ష్మీ అమ్మవారి విగ్రహం మండపం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 26వ తేదీతో ఉత్సవాలు ముగియనున్నాయి.

గృహ నిర్మాణాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న గృహ నిర్మాణాలపై పలాస ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది, మండలాల ప్రత్యేక అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. మున్సిపల్‌కమిషనర్ రామారావు, సీఎంఎం మోహనరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్ ఎంపీపీకి పరామర్శ

కాశీబుగ్గ: మందస వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ తల్లి శాంతమ్మ శుక్రవారం అనారోగ్య కారణాలతో మరణించారు. దీంతో ప్రసాద్ కుటుంబాన్ని పలువురు నాయకులు శనివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు.

పారదర్శకంగా సోషల్ ఆడిట్



మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

వజ్రపుకొత్తూరు: మండలంలో ఉపాధి హామీ పథకంలో 2023-24 ఏడాదిన జరిగిన పనులపై సోషల్ ఆడిట్ పాదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పది రోజుల పాటు మండలంలోని వివిధ పంచాయతీల్లో సోషల్ ఆడిట్, గ్రామ సభలు జరుగుతున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, ఫీల్డు అసిస్టెంట్‌లు ఆడిట్ బృందానికి సహకరించి రికార్డులు అప్పగించాలని ఆదేశించారు. ఈ నెల 30న పథక సంచాలకులు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆడిట్ సమావేశం ఉంటుందన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, ఉపాధి హామీ పథకం ఏపీడీ స్వరూపరాణి, ఎస్ఆర్‌పీ రామరావు, ఏపీఓ కేశవరావు ఉన్నారు.

డ్యాన్స్ పోటీల విజేత ఇచ్ఛాపురం



మొదటి బహుమతి అందుకుంటున్న ఇచ్ఛాపురం డాన్సర్లు

కాశీబుగ్గ:

మందస మండలం బహాడపల్లి గ్రామంలో గౌరమ్మ సంబరాల సందర్భంగా జిల్లా స్థాయి డాన్స్ పోటీలు జరిగాయి. ఇందులో గ్రూప్ డాన్సు ఆరు బృందాలు, డ్యూయెట్‌లో ఎనిమిది, సోలో 15 మంది పాల్గొన్నారు. వీరిలో మొదటి బహుమతి ఇచ్ఛాపురం జట్టు సాధించుకోగా.. ద్వితీయ బహుమతి సోంపేట, తృతీయ బహుమతి పలాస ఆర్‌డీఎక్స్ సాధించాయి. న్యాయ నిర్ణేతలుగా సినీనటుడు అమ్మ రామకృష్ణ, సినీ కొరియాగ్రాఫర్ తారక్, ఉపాధ్యాయులు రాపాక వల్లభరావు మాస్టారు వ్యవహరించారు. విజేతలకు కమిటీ సభ్యులు రూ.31 వేలు నగదు, షీల్డులను నిర్వాహకులు అందించారు.

ఆరుబయటే వంటలు..



ఇచ్ఛాపురం మండలం ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 315 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఈ పాఠశాలలో వంటశాల లేదు. దీంతో వంట నిర్వాహకులు ఆరుబయట చిన్న పాటి పాకను నిర్మించి అందులోనే వంటలు చేస్తున్నారు. అలాగే మధ్యాహ్న భోజనాలు సమయంలో పిల్లలందరూ ఒకేసారి మండుటెండలో, వర్షంలో భోజనం కోసం ప్లేట్లతో నిలబడాల్సి వస్తోంది. ఇప్పటికైనా వంట శాలను ప్రభుత్వం నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్


ప్ర'జల'కష్టాలు!



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని మొదటి మూడు వార్డుల ప్రజలు మంచినీటి కోసం అవస్థలు పడుతున్నారు. 1986లో మున్సిపాలిటీగా ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ వార్డు వాసులు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. తమ కష్టాలను తీర్చడంలో అధికారులు విఫలమయ్యారని పురుషోత్తపురం, అమీన్‌సాహేబ్‌పేట, బోర్డర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు వాటర్ ట్యాంకర్ల నీటిని అందిస్తున్నప్పటికీ ప్రజలందరికీ పూర్తిస్థాయిలో చేరడంలేదు. నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

–ఇచ్ఛాపురం

తవ్వేసి వదిలేశారు..



కోటబొమ్మాళి కస్తూర్బాగాంధీ బాలికల విశ్వవిద్యాలయం వద్ద మురుగు కాలువను మూడు నెలల క్రితం తవ్వివదిలేశారు. దీంతో అందులో వర్షం నీరు చేరడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా సమీపంలో ఉన్న కేజీబీవీ విద్యార్థినులు అనారోగ్యానికి గురౌతున్నారు. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం స్పందించి కాంక్రీట్ కాలువ నిర్మాణం చేట్టాలని స్థానికులతోపాటు విద్యార్థినులు వేడుకుంటున్నారు.

కోటబొమ్మాళి

అక్కరకురాని పశు వైద్య కేంద్రం



డొంకూరు మత్స్యకార తీర ప్రాంతంలో 2013 జూన్ నెలలో నిర్మించిన పశువైద్య కేంద్రం ఇప్పుడు అక్కరకు రాకుండా పోయింది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ భవనంలో ఒక్క రోజు కూడా పశువైద్య సిబ్బంది విధులు నిర్వహించలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే అక్కడ పశుపంవర్ధక సిబ్బందే లేరు. దీంతో ఈ భవనం చీకటి కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయిందని ఈ ప్రాంతీయులు చెబుతున్నారు. ఇప్పటికైనా సిబ్బందిని నియమించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

ఏపీటీపీసీ చైర్మన్‌కు సత్కారం



బాబూరావును సత్కరించిన దృశ్యం

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జ బాబూరావును గరుడఖండి పంచాయతీ పాతజగదేవపురం గ్రామస్తులు శనివారం దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పీరుకట్ల విఠల్, బడ్డ నాగరాజు, సాసుమన చంద్రమౌళి, హేమసుందర్ ఉన్నారు.

అదనపు ఫీజుల భారం లేకుండా చూడండి

● ఆర్డీవోకు డిగ్రీ విద్యార్థుల వినతి



ఆర్డీవో కృష్ణమూర్తికి సమస్యలు విన్నవిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న తమకు అదనపు ఫీజుల భారం లేకుండా చూడాలని ఆయా విద్యార్థులు శనివారం టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి విన్నవించారు. ఐదో సెమిస్టర్‌కు సంబంధించి కోర్సు ఫీజు చెల్లిస్తే తప్పా పరీక్ష ఫీజులు చెల్లించడానికి వీలు లేదని కళాశాల సిబ్బంది చెప్పడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. దీంతో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్ సాయంతో ఆర్డీవోను కలిసి సమస్యను విన్నవించారు. స్పందించిన ఆర్డీవో కళాశాల ప్రిన్సిపాల్ గోవిందమ్మతో మాట్లాడగా.. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. అయితే ముందుగా పరీక్ష ఫీజులు తీసుకోవాలని కోర్సు ఫీజుల విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఆర్డీఓ చెప్పడంతో ప్రస్తుతానికి సమస్య సద్దుమనిగింది.

ప్రభుత్వ స్థలాల పరిశీలన



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

పలాస: మండలంలోని పలు ప్రభుత్వ స్థలాలను పలాస ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి శనివారం పరిశీలించారు. తర్లాకోట, బొడ్డపాడు, కోసంగిపురం,రామక్రిష్ణాపురం తదితర ప్రాంతాల్లో స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, మండల ప్రత్యేక అధికారి, గృహనిర్మాణ శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు అభ్యాసన సామర్థ్యాలపై దృష్టి సారించాలని ఎంఈవో కురమాన అప్పారావు అన్నారు. తిప్పనపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో శనివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, గణితంపై మక్కువ పెంచుకునేలా కృత్యాధారణ బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఆశి పురుషోత్తమరెడ్డి ఉన్నారు.